# ప్రేమ గుడ్డిది

"నువ్వేవన్నా కుంటాడివా ? గుడ్డాడివా ? అడుక్కోపోతే శుభ్రంగా పని చేసుకోకూడదూ ?

సిన్నోడు ఈ మాటలు చాలాసార్లు విన్నాడు కాని ఆ వేళెందుకో ఊరుకోబుద్ధికాలేదు.

"పోనీ ఏదయినా పనుంటే జెప్పండి. సేత్తాను. తర్వాత కాస్తంత అన్నం పడెయ్యండి" అన్నాడు.

ఆ ఇంటావిడ వాడినుంచి అలాంటి సమాధానం ఎదుర్చూడలేదు. తీరా విన్నాక అవాక్కయ్యింది.

తేరుకుని "సర్లె నీలాంటి ముష్టి వెధవల్ని పనిలోకి పెట్టుకుంటే ఏ వస్తువు దొరికితే అదే పట్టుకు పోతారు" అంది.

ఆ మాటలకి సిన్నోడుకి కోపం వచ్చింది. కాని ముష్టివాళ్ళకి కోపం రాకూడదన్న విషయం వాడికి బాగా తెలుసు. ముష్టివాళ్ళు సాధారణంగా అలాంటి పరిస్థితుల్లో సణుక్కుంటూ వెళ్ళిపోతాడు. మరీ కడుపుమండితే తిట్టుకుంటారు.

సిన్నోడు సణుక్కున్నాడు. "ఎప్పుడొచ్చినా ఏంబెట్టవ్ మా తల్లివి. అసలు మొగుడూ- పిల్లలకయినా అన్నం పెడతావా?" అంటూ వెళ్ళిపోయాడు.

వాడి మాటలు ఆ ఇల్లాలికివినబళ్ళేదు. కాని ఏదో సణుక్కుంటున్నాడని మాత్రం వింది.

"పెడితే పెళ్ళి. లేకపోతే చావు- వెధవలు" అంది. ఆ మాటలు

విన్నాడు సిన్నోడు తన పణుగుడికి ఏదో రియాక్షన్ వచ్చినందుకు వాడికి ఆనందం కలిగింది.

వాడా వీధి చివర కరెంటు స్థంభం దగ్గర నిలబడి గిన్నెలోకి చూసుకున్నాడు. గిన్నె చాలా వరకూ అన్నం, కూర, పులుసు-కలగా పులగంతో నిండింది,

వాడికి తృప్తిగా అనిపించింది.

గిన్నెమీద గుడ్డ మూతేసి వడివడిగా సంతపాకల కేసి నడవటం మొదలెట్టాడు. వాడు సంతపాకల దగ్గరికి చేరుకునేసరికి ఓరాటకి నిల బడి కూర్చున్నాడు పాటల తాత. అతనికి పగలే కళ్ళు అంతంత మాత్రంగా కనిపిస్తాయి. అలాంటిది రాత్రిపూట, అందులోను ఆవేళ చిమ్మచీకటి....

ఓ అవయవం పోతే దాని పవర్ మరో అవయవానికి వస్తుం దేమో?.... సిన్నోడు దగ్గరవుతుండగా –

"సిన్నోడా ? వచ్చావా ?" అనడిగాడు.

సిన్నోడికి ఆనందం ముంచుకొచ్చింది. తాత అంత క్రితం రాత్రి నేర్పిన పాట జ్ఞాపకాని కొచ్చింది.

"దేవాలయములోని దేవుడేడకు పోయె

దీపాలు లేవేమె మనసా !

ధిమ్మ ధిమ్మన చిమ్మ చీకటుల లోపలను దెయ్యాలు ఆడవే మనసా !!"

గట్టిగా పాడాడు. తాత నవ్వాడు.

"తాతా. నీకు అన్నం తెచ్చాను. పద మనిద్దరం చెరువుగట్టున కూసుని కబుర్లు చెప్పుకుంటూ తిందాం." చాలా ఉత్సాహంగా హుషా రుగా చెప్పాడు సిన్నోడు.

తాత లేచి ఓ కాలికి చిల్లులు పడ్డ తోలు చెప్పు. మరో కాలికి పురుకూన కట్టిన రబ్బరు చెప్పు తొడుకున్నాడు. సరిగ్గా అప్పుడే....

బుడ్డిదీపం వెలుగులో ఓ ఇటుక ముక్కకి చిన్న అద్దం ఆనించి అందులో మొహం చూసుకుంటూ కళ్ళకి కాటుక పెట్టుకుంటున్న ఆ అందాల బరిణెను చూశాడు సిన్నోడు.

ఆ క్షణంలో వాడు సంతపాకల్ని, తన ముష్టి తనాన్ని, తాత నేర్చిన పాటని, ముష్టి గిన్నెని, అందులో వున్న ముష్టి అన్నాన్ని.... సర్వాన్ని మర్చిపోయాడు.

"నీ యమ్మ దేవుడు- దీనికి ఏం కళ్ళిచ్చాడ్రా" మనసులో అనుకుందామనుకున్న మాట పైకి అనేశాడు.

"ఏంట్రా- సిన్నోడా ?" ఆర్ధం కాని తాత అడిగాడు.

"తాతా అవతల పాకలో ఉన్న అ పెద్ద కళ్ళ పిల్లెవరు ?" మెల్లగా తాతకి మాత్రం వినిపించేట్టుగా అడిగాడు.

"దాని మీద నీకూ కళ్ళడ్డాయా?" తాత గట్టిగానే అన్నాడు. ఆ మాటలు వినిపించినట్టున్నాయి. అందాల బరిణె వీళ్ళ వైపు ఓ చూపు విసిరింది.

"ఉష్- నెమ్మదిగా మాట్లాడు." అన్నాడు సిన్నోడు.

"అదంతా సెప్తాకాని నడు ముందర కూడు తిందాం. కడుపులో కాల్తాంది" అన్నాడు తాత.

ఓ చెత్తో గిన్నె పట్టుకొని నడిపించుకుంటూ సిన్నోడు చెరువు గట్టువైపు బయల్దేరాడు.

వాడికి మనసు మనసులో లేదు....

సంతపాకల్నించి బయటకు రాగానే ఉండబట్టలేక తాతని అడిగాడు.

"తాతా ! ఎవత్తది ?"

"సూత్తావుంటే తెల్లారేటప్పటికి దాంతో కాపర మెట్టేసట్టున్నావ్ అంత తొందరేంటిరా గుంటెదవా" ఆప్యాయంగా కూకలేశాడు.

"సెప్పుతాతా-ఎవత్తోగాని బలే గుంది. పైగా సోకు చేసు కుంటాది. ఈ రేత్తిరి అదురుష్టం ఎవరిదో ?"

సిన్నోడి మాటలకి అన్నీ ఉడిగిపోయిన తాత పకపక నవ్వాడు. వాణ్ని ఇంకా ఏడిపించాలన్నట్టు ఆ పిల్ల విషయం చెప్పకుండా దాచే స్తున్నాడు.

చెరువుగట్టుకి చేరిం తర్వాత ఇద్దరూ అన్నం తినడం మొద లెట్టారు.

"ఏమైనా కబుర్లు సెప్పరా సిన్నోడా ?" అన్నాడు తాత.

"నువ్వాపిల్ల యిసయం చెప్పిందాకా కానీ మాట్లాడేదిలేద్ ...."

"అదీ మనలాగే అడుక్కు్కతినేదే సాయంత్రమేల వచ్చింది. మొన్నటిదాకా ఖీమూరంలో ఉండేదట. నువ్వు సెప్పినట్టుగానే మంచి సోకులాడి. సాయంత్రం సంతపాకల కాడికొచ్చి, దాని సామాను నన్ను సూడమని జెప్పి బయటకిపోయింది. మళ్ళీ తిరిగొచ్చేసరికి కూడా ఓ రిక్షావోడున్నాడు. ఈ రేత్తిరికి ఆడితో పోద్దనుకుంటా ....అయినా దాని గురించి నీ కింత ఇచారణెందుకురా- నీ కన్నా అయిసులో అది పెద్దది"

"దాన్ని జూసినాక మనసు పోయింది తాతా మనసు కలవాలేగాని అయిస్పేటి తాతా!"

సినిమాలు ఎక్కువగా జూసే సిన్నోడి మాటలకి తాత ఎక్కువ ఆశ్చర్యపడలేదు.

ఆ సిన్నోడికి అన్నం సహించడం లేదు. పెద్ద కళ్ళపిల్ల జ్ఞాపకం వస్తోంది. వాడి ఊహల్లో రిక్షావాడు, అది కల్సి వెడుతున్నట్టు టూరింగ్ టాకీస్ వెనకాల ఇసక దగ్గరికి చేరుకున్నట్టు. ఆ ఇసక వాళ్ళకి పరుపులా అమరినట్టు....

తర్వాత ....తర్వాత....

సిన్నోడు తన గిన్నెలో అన్నం తీసేసి తాత గిన్నెలో వేసేశాడు.

"దానిమీద ఎంత మోజయితే మాత్రం అన్నం తినవేటిరా ఎదవా" తాత కోప్పడ్డాడు.

ఆ ఊరు గాంధీగారు కలలుకన్న రామరాజ్యంలా అనిపించదు కాని, ముష్టివాళ్ళకి బాగానే ఉంటుంది. ఆ ఊళ్ళే ధర్మం నాల్గు పాదాల నడవలేకపోయినా ధర్మం వేసే గడపలు నాల్గున్నాయనే చెప్పొచ్చు. ఆ ఊళ్ళో ఎన్ని పార్టీలున్నాయన్నది ముష్టివాళ్ళకి అనవసరమైన విషయం – ఎందుకంటే వాళ్ళు ఓటర్లు కాదు.

ఆ ఊళ్ళో వ్యవసాయం చేసుకునే జనం చాలామంది ఉన్నారు. వాళ్ళంతా బియ్యం ముష్టివేస్తారు. బ్రాహ్మణ కుటుంబాలు ఎక్కువగానే ఉన్నాయి. వాళ్ళంతా తమ పిల్లలు తినగా మిగిలిన చద్దన్నం ముష్టాళ్ళకే వేస్తారు. ఇహపోతే....వ్యాపారంచేసుకునే వాళ్ళు మాత్రం ప్రతి ఆదివారం ఒక్కొక్కడికి రెండు పైసలు చొప్పున ముష్టివేస్తారు. రెండు పైసలకి బీడీ కూడా రాదన్న విషయం ముష్టి వాళ్ళకి తెలుసు. (ధరలు పెరగడం లేదన్న గవర్నమెంటు వాదన వాళ్ళకి అనవసరం) అయినా "బెగ్గర్స్ కెనాట్ బి ఛూజర్స్ అన్న ఇంగ్లీషు వాడి సామెత వాళ్ళకి తెలుసు. కాబట్టి అయిదు పైసలకి తక్కువయితే పుచ్చుకోమని వాళ్ళు అనరు. ముష్టివాళ్ళకి ట్రేడ్ యూనియన్ పెట్టడం కుదరదని భారతదేశంలో అన్ని పార్టీల వాళ్ళు ఒప్పుకున్నారు.

(ముష్టివాళ్ళు సంపద సృష్టించరు కాబట్టి-వాళ్ళు విప్లవకారుల్లో చేరడం కుదరదని"— మావోయో, లెనినో చెప్పినట్టుగా నాకో పెద్ద కమ్యూనిస్టు చెప్పాడు)

సినోన్నడు ఆ వూరు వచ్చి ఎన్నాళ్ళయిందో ఖచ్చితంగా చెప్ప

లేదు. వాడికా వూళ్లో కాసిని బియ్యం, కాస్త అన్నం, కాసిని పైసలు దొరుకుతాయి.

ఆ ఊళ్లో అరవై పైసలమీద సినిమా చూపించే టూరింగ్ టాకీసుంది. సిన్నోడు ఆ వూళ్లో వుండిపోవడానికి అదో కారణం. ఆ వూళ్ళో శనివారం సంత జరుగుతుంది. సంతలో అడుక్కుంటే కొంత డబ్బులు. కాసిని ఉల్లిపాయలు, కాసిని పచ్చి మిరపకాయలు దొరుకుతాయి. వాటిలో ఒకటి రెండురోజులకి సరిపడ పచ్చడి నూరుకోవచ్చు.

వారంవారం జరిగే సంతకోసమని పంచాయితీవారు సంతపాకలు కట్టించారు. శనివారం మధ్యాహ్నంనుంచి రాత్రి వరకు తప్ప మిగతా సమయాల్లో ముష్టివాళ్ళంతా అక్కడే కాపురముంటారు. వర్షాకాలంలో కాస్త ఇబ్బంది ఔతుంది తప్ప మిగతా కాలాల్లో వాళ్ళ వసతి సౌకర్యం బాగానే ఉంటుంది.

తాత ఆ ఊరికి కొత్తగా వచ్చాడు. తాత బాగా ముసిలాడై పోయాడు. కళ్ళు సరిగా కనిపించవ్. గుడ్డితనం ముష్టివాళ్ళకి అదృష్టమే! మామూలు ముష్టివాడికన్నా, కుంటాడికి ఎక్కువ ముష్టి దొరుకుతుంది. కుంటాడికన్నా గుడ్డాడికి మరింత ఎక్కువ దొరుకుతుంది. ముష్టాళ్ళలో గుడ్డాడు ఇంగ్లండ్ రాకుమారుల్లో ప్రిన్స్‌చార్లెస్ లాంటివాడు. కాని పాపం తాతకి నడిచే ఓపికకూడా లేదు.

తాతతో పరిచయం బాగా పెరిగాక "నువ్ నాతోనే ఉండు నే తెచ్చేదాంట్లో నీకూ కొంచెం ఎడతాను" అన్నాడు సిన్నాడు.

సిన్నోడికి తాత గురువు, దైవం, స్నేహితుడు.... అన్నీను.

*  *  *

మర్నాడు పొద్దున్నే సిన్నోడెళ్ళి అందాల బరిణెను పరిచయం చేసుకున్నాడు. ఆ పెద్దకళ్ళ పిల్ల పేరు నీలమ్మ-క్రితం రాత్రి చీకట్లో

గుడ్డిదీపం వెల్తురులోకన్నా ఇప్పుడామె ఇంకా ఎక్కువ అందంగా కన బడుతోంది. ఆమె సిన్నోడికన్నా నాల్గయిదేళ్ళు పెద్ద ఉంటుంది.

సిన్నోడికి నీలమ్మ నచ్చింది. ఆమె పెద్ద పెద్ద కళ్ళు నచ్చాయి. ఆమె ఎత్తయిన గుండెలు నచ్చాయి. పెద్ద మొత్త నచ్చింది.

"ఉంటే ఇలాటిదాంతో వుండాలి" అనుకున్నాడు. మాట కలిసిన రెండోరోజే "మనిద్దరం కల్సి వుందాం. నీకన్నీ నే జూస్తాను" అని మనసు విప్పి జెప్పేశాడు. అలా అన్నప్పుడు వాడికి ఏదో తెలుగు సిని మాలో హీరో జ్ఞాపకం వచ్చాడు.

ముష్టాళ్ళు ఘనంగా పెళ్ళిళ్ళు చేసుకోలేరు. 'కల్సుండటం' అన్నది వాళ్ళకి పెళ్ళిలాంటిది. పై తరగతి, మధ్య తరగతి జనాని కుండే సాంఘిక విలువలు వాళ్ళకు లేవు. కావాలంటే కల్సి వుంటారు. అక్కర్లేదనుకుంటే విడిపోతారు- అంతే!

ఆ రాత్రి టూరింగ్ టాకిస్ వెనకాల ఇసుకలో నీలమ్మ మెత్తని గుండెలు సిన్నోడికి ఆశ్రయం ఇచ్చాయి. వాడికి ఎన్నో సినిమాలు జ్ఞాపకం వచ్చాయి. అందులోని 'ఈరోలు, ఈరోయిన్లు' జ్ఞాపకం వచ్చారు. వాళ్ళ బిగి కౌగిలింతలు జ్ఞాపకం వచ్చాయి.

ఆ అమావాస్య చీకట్లో నీలమ్మ సిగ్గుపడకుండా తనని తాను సిన్నోడికి సమర్పించుకుంది.

సిన్నోడికి జీవితంలో మొదటిసారి ఆడదాని సుఖం తెల్సింది. ఆ సుఖం ఎప్పటికీ వదులుకోకూడదని వాడో నిర్ణయానికి వచ్చాడు.

కొద్ది రోజులకే తాత చచ్చిపోయాడు. పంచాయితీవాళ్ళు పాకీ వాళ్ళ ద్వారా తాతకి దహన సంస్కారం జరిపించారు. ఆ రోజు సిన్నాడు ఏడ్చాడు. తనని పెంచిన ముసల్ది పోయినప్పుడు ఏడ్చినట్టు

ఏడ్చాడు. తన జేబులో వున్న చిల్లరంతా పాకీ అప్పన్న కిచ్చేసి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు.

సిన్నాడి జీవితం ఆనందంగానే వుంది. ఆనందం అన్నది మానసికమైంది వాడికి నీలమ్మతోటి జీవితం, ఆమె సాహచర్యం, ప్రణయం, శృంగారం, చిన్ని చిన్ని పోట్లాటలు అన్నీ ఆనందాన్నే కలిగిస్తున్నాయి. నీలమ్మ స్వతహాగా షోకులాడి. ఆమెకు మంచి జీవితంమీద మోజెక్కువ.

సంతల్లో చౌకరకం పౌడర్లు, రిబ్బన్లు, కాటుక వగైరా కొంటూంటుంది. ఇద్దరూ కష్టపడి అడుక్కుంటే వాళ్ళ జీవితం బాగానే ఉంటుంది కాని సిన్నాడి పంచన చేరాక ఆమె అడుక్కోడం మానేసింది. ఇప్పుడు సిన్నాడు ఇద్దరి తిండికోసం, ఆమె షోకులకోసం కష్టపడాలి. అయినా వాడెప్పుడూ బాధపళ్లేదు.

నీలమ్మ తనకి దొరకడమే గొప్ప అదృష్టంగా భావిస్తాడువాడు. ఆమెను సుఖపెట్టడానికి, సంతోషపెట్టడానికి ఎంత కష్టపడాల్సివచ్చినా బాధపడడు.

తాత నేర్పిన పాటలు పాడుకుంటూ అడుక్కుంటాడు. మరిన్ని గడపల దగ్గర నిలబడతాడు. ఒక్కోరోజు సరిపడా దొరుకుతుంది. మరో రోజు అసలేవీ దొరకదు. వాడికి కష్టాల్లా అనిపించవ్. కొంచెమే ముష్టి దొరికితే అది నీలమ్మకి పెట్టి- తను కడుపునిండుగా నీళ్ళుతాగి ఆమె గుండెలమీద హాయిగా పడుకోగలడు.

ఇలా కాలం గడుపుతున్న సిన్నాడికి నిజంగానే కష్టం ముంచుకొచ్చింది.

అది సంతపాకలు కూలిపోవడం కాదు. ఆ ఊరు అంటుకుపోవడం కాదు. అడుక్కోవడం అక్కడ నిషేధింపబడనూలేదు.

వాడికి కష్టం రాందాసు రూపంలో వచ్చింది.

రాందాసు సంతపాకల దగ్గర చేరిన కొత్త ముష్టాడు. వాణ్ని చిన్నప్పుడు చేరదీసిన ముఠా వాళ్ళు ఎక్కువ సంపాయించవచ్చున్న ఉద్దేశ్యంతో వాడికో కాలు విరిచేశారు. అంచేత రాందాసు చంకలకింద కర్రలు పెట్టుకుని అడుక్కుంటున్నాడు.

కుంటాడు కాబట్టి రాందాసుకి సహజంగా సిన్నాడికన్నా ఎక్కువ ముష్టి దొరుకుతుంది. అంతేకాకుండా అంత క్రితం వాడు నిలువవేసుకున్న డబ్బులు చాలానే వున్నాయి.

తనకన్నా ఎక్కువ సంపాదిస్తున్నాడిని కాని, తనకన్నా ఎక్కువ సిరిసంపదలు కలవాడని కాని, కుంటాడై తనకన్నా ఎక్కువ అదృష్టవంతుడయ్యాడని కాని- సిన్నాడికి రాందాసుమీద అసూయలేదు. కాని వాడి బాధల్లా రాందాసు అక్కడికొచ్చినప్పట్నుంచీ నీలమ్మ ఎక్కువగా రాందాసు దగ్గరే కూర్చోడం, వాడితోటే మాట్లాడం, వాడి గురించే మాట్లాడం, వాడి సంపాదన గురించి పొగడటం.... ఇవి సిన్నాడు భరించలేకపోతున్నాడు. నీలమ్మ రాందాసువైపు ఆకర్షింపబడుతోందని వాడికి గట్టి నమ్మకం ఏర్పడిపోయింది.

నీలమ్మమీద సిన్నాడికి విపరీతమయిన ప్రేమ వుంది. ఆమెకు 'మంచి' జీవితంమీద మక్కువ వుంది. అంచేత నీలమ్మ తనని వదిలేసి రాందాసుతో వెళ్ళిపోతుందన్న బెంగ, భయం వాడికి ఎక్కువయ్యాయి. ఆ భయంతో, ఆలోచనతో వాడికి వణుకు పుట్టుకొచ్చింది,

నీలమ్మ ఓరోజు చెంపపిన్నులు చూపించింది.

.... .... .... ....

"రాందాసు కొనిపెట్టాడు"

మరో రోజు పౌడర్‌డబ్బా చూపించింది.

.... .... .... ....

"రాందాసు కొనిపెట్టాడు"

మరో రోజు చిన్న సబ్బుబిళ్ళ.

ఇలా ఎన్ని రోజులు.... ఎన్నో....

ఆ రాత్రి నీలమ్మ దగ్గర పడుకున్న సిన్నాడు

"ఏంటే నీలా ఇది?" అన్నాడు.

"కంపెనీ బాడీ"

....... ....... ....... ....... .......

"రాందాసు కొనిపెట్టాడు"

సిన్నాడు లాగి లెంపకాయ కొడదామనుకున్నాడు. కాని కొట్టలేక పోయాడు. దూరంగా జరిగి పడుకున్నాడు.

ఆ రాత్రి చాలా ఆలోచించాడు. వాడికి నీలమ్మ లేకుండా తను బతకలేనని గట్టిగా అనిపించింది. మెల్లగా ఆమె పక్కచేరి ఆమె చుట్టూ చేతులేశాడు. మెలకువ వచ్చి నీలమ్మ మెల్లగా కదిలి సిన్నాణ్ణి చుట్టే సింది.

"నీలా నన్ను ఒదిలి ఎల్లిపోకే. నువ్ లేకపోతే నేను సచ్చి పోతానే" అన్నాడు.

ఆమె 'ఊ' అంది.

ఆ రాత్రి సిన్నాడికి నాగుబాముతో సంభోగిస్తున్నట్టుగా భయం వేసింది.

◆ ◆ ◆

రోజులు దొర్లిపోతున్నాయ్....

వర్షాకాలం మూలంగా ముష్టి ఎక్కువ దొరకడంలేదు. సిన్నాడికి రెండు పొట్టలు నింపడం, నీలమ్మ సరదాలు తీర్చడం కష్టంగానే ఉంది. రాందాసుతో ఆమె స్నేహం అభివృద్ధి చెందుతూనే ఉంది.

రాందాసుతో ఆమె మాట్లాడటం, అతనినుంచి బహుమతులు తీసుకోడం.... జరుగుతూనే ఉంది. అలాంటి వాటికి సిన్నాడు అభ్యంతరం చెప్పడం మానుకున్నాడు. రానురాను రాందాసుతో సినిమాలకు వెళ్ళడం మొదలెట్టింది. సిన్నోడు సహించాడు.

మెల్లగా రాందాసుతో సినిమాహాలు వెనకాల ఇసకమీదికి వెళ్ళడం మొదలెట్టింది.

సిన్నాడు తెలియనట్టుగా ఊరుకున్నాడు.

నీలమ్మ తనని ఒదిలి వెళ్ళిపోకుండా ఉంటే చాలనుకున్నాడు. ఆమె లేని జీవితాన్ని వాడు ఊహించలేడు. ఆమె తన మనిషిగా ఉంటే చాలు. అదే వాడి తపన, ఆశ, ఆశయం....

ఆమెకు వీటితో పనిలేదు. ఆమె ఎప్పుడూ మంచి జీవితంకోసం ఎదురు చూస్తూంటుంది.

ఓ రోజు........

"నేను, రాండాసు రేపు అత్తిలెల్లి పోతున్నాం........" అంది నీలమ్మ.

ఆ మాటలకి చిన్నాడు కలవరపడ్డాడు. వాడికి భూమి కుంగిపోతున్నట్లు, సంతపాకలు అంటుకున్నట్టుగా, తను నమ్ముకున్న ముష్టిగిన్నె తనని నెత్తిమీద కొడుతున్నట్టు, ప్రపంచంలో "ధర్మం" చచ్చిపోతున్నట్టు.... అనిపించింది.

"నీకిది ధర్మం కాదే నీలా !" గొంతు పెగుల్చుకుని అన్నాడు.

నీలమ్మ ఏవీ మాట్లాడలేదు.

"నీకు ఉన్నంతలో లోటు సెయ్యలేదు. నేనేం పాపం జేశానని ఎల్లిపోతున్నావ్" బతిమాల్తున్నట్టుగా అన్నాడు.

"నాకు కూడెట్టం, ఎయ్యేనా కొనియ్యడం నీకు కష్టంగాఉన్నది. రాందాసు కొంటాడు. ఆడికి సాలా ముష్టిద్దొరుకుద్ది. పైగా ఆడికాడ డబ్బున్నాది, నన్ను బాగా చూసుకుంటా నన్నాడు. కాలూ సెయ్యి వువ్వోడివి. నువ్వేం సంపాయిత్తావ్! నాకేమెడతావ్ ?" అంది.

సిన్నాడు ఏవీ మాట్లాడలేదు.

ఆలోచనలో పడ్డాడు. 'అన్ని అవయవాలు ఉన్న తనకన్నా కుంటాడైన రాందాసుకి ఎక్కువ సంపాదన ఉంటుంది. అది నిజం....

నీలమ్మ తనతో ఉండాలంటే రాందాసుతో సమానంగా .... కాదు.... అంతకన్నా ఎక్కువ సంపాయించాలి.... ఎక్కువ డబ్బు ఉండాలి....ఆమెకావల్సినవన్నీ కొనిపెట్టాలి.

రిబ్బన్లు, చెంప పిన్నులు, పౌడర్లు, అద్దాలు, కంపెనీ బాడీలు, సెకండ్ హాండ్ చీరలు, రవికలు....

ఏదో చెయ్యాలి.... ఏంచేసినా రాందాసుకన్నా ఎక్కువ సంపాయించాలి.

అలాగయితే తిరిగి ఆమెను రాందాసు నుంచి ఆకర్షించ గలడు. ఆమెను తిరిగి పొందాలి.... ఆమెను, ఆమె పెద్ద కళ్ళను, ఆమె ఎత్తయిన రొమ్ముల్ని, ఆమె కౌగలింతల్ని, ఆమె తనకిచ్చే స్వర్గ సుఖాల్ని....

సినిమాల్లో ఈ రోలు, ఈరోయిన్ల కోసం ఏదయినా చేస్తారు. కొండలమీంచి దూకుతారు. సముద్రంలోకి ఉరుకుతారు. ఇలన్‌గాళ్ళని తంతాడు. నానా కష్టాలు పడతారు.

అంతకన్న ఎక్కువ కష్టమైనా సరే.... నీలమ్మను దక్కించు కోవాలి....

*　　　*　　　*

ఆరాత్రి సిన్నాడి కోరిక ప్రకారం నీలమ్మ ఆఖరిసారిగా సినిమా హాలు వెనకాల ఇసుకమీదకి వచ్చింది....ఆ రాత్రి అక్కడ వెన్నెల ఫరచుకుంది.

"ఈ వెన్నెల్లో నీ కళ్ళు కలువపువ్వుల్లాగున్నాయే!" అన్నాడు సిన్నాడు. ఆమె నవ్వింది.

"నువ్వూ — రాందాసుగాడు రేపెల్లిపోతున్నారా ?"

"అవును. ఎల్తన్నాం"

వాడు ఆమె ఒళ్ళో తలెట్టుకుని పడుకున్నాడు. ఆమె ఆకాశం లోకి, శూన్యంలోకి చూస్తోంది. నిర్లిప్తంగా చూస్తోంది.

మరుక్షణంలో వాడు గిలగిల్లాడిపోతున్నాడు. బాధతో, మంటతో, సుళ్ళు తిరిగి పోతున్నాడు. దొర్లేస్తున్నాడు. వాడి చేతిలోంచి చిన్న సీసా బయటపడింది.

"ఏమైందిరా!" వాణ్ని పొదివి పట్టుకుని భయంగా అందుకే కళ్ళల్లో జిల్లేడు పాలుపోసుకున్నాను. గుడ్డొణ్నయిపోతా - రాందాసు కన్నా ఎక్కువ సంపాయిత్తా— నువ్ నన్నొదిలి ఎల్లవ్ కదూ. సెప్పె నీలా— నువ్ నన్ను వొదిలి ఎల్లవ్ కదూ!"

ఆ మాటలు విన్న నీలమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయ్. ఆమె కళ్ళల్లో నీళ్ళను కాని, మెరుపును కాని వాడింక చూడలేదు. సిన్నాడు నీలమ్మను వెనకేసుకుపోయి మండుతున్న కళ్ళని ఆమె గుండెలకేసి రాసుకుంటున్నాడు.

లోకమంతా వెన్నెల చల్లగా ఉంది, వాడి కళ్ళల్లో పడ్డ వెన్నెల మాత్రం అగ్నికీలలా మండుతోంది.

— "ఆంధ్రభూమి" ఆగష్టు 1982